# నిజం

ఆ ఊరు చుట్టూరా కంపచెట్లు పెరగడంవల్ల ఊరు సరిగ్గా కనపడడంలేదు. ఊరి మధ్య ఓపెద్ద పెంకుటిల్లు. దానినలుపైపుల విశాలమైన ప్రహారీగోడ ముందు నుండి పెద్దగేటు, వెనక నుండి ఓదిడ్డి దర్వాజ. ఇంటి ముందు ఓ చింతచెట్టు.

పొద్దుపొడిచేవరకు ఊరు ఊరంతా కదిలొచ్చి చింతకింద పడి ఉన్న శవాన్ని చూస్తున్నారు.

"ఎట్లా చచ్చాడు?" ఒకరు.

"నిన్న ఉదయమే గదా ఆయన పట్టణానికి వెళ్ళింది.

రాత్రి రాగానే, ఇంట్లోకి పోకముందే ఈ దారుణం జరిగిందా?"

మరొకరు.

"అయ్యో ఇంత ఒతుకు ఒతికి యింట్లోనయినా జీవొదల లేదు. పాపం."

ఓముదుసలి.

"పాపాలు సేయక పోతే మానపుణ్ణాలు సేసింజేడా అందు కనే ఈసావు."

మరో ముదుసలిఅవ్వ మెల్లగ అన్నది.

భార్య తలుసుకొని తలుసుకొని ఏడుస్తూంది. చాలామంది ఆడవాళ్ళు ఆయన ఒతికి ఉన్నప్పుడు ఏడిచే వాళ్ళట.

రంగారావు అంటే ఈ ప్రాంతంలో తెలియని వాళ్ళు లేరు. ఆయన మంచి కంటే చెడే ఎక్కువ చేసేవాడు కాబట్టి, అందర్కి ఆయన గూర్చి బాగా తెలుసు. అంతటి దుర్మార్గుడు యిలా అకస్మాత్తుగా ఎలా చచ్చాడో ఎవర్కి అంతు చిక్కడం లేదు.

"నా మొగుడు చావలేదు. ఎవరో చంపారర్రో దేవుడా"— భార్య ఏడుస్తూనే.

''పామును ఎవరు చంపుతారు?'' అతని చూపుల్లో మాడి పోయిన అమాయకపు ఆడ వాళ్ళు.

గొడ్డల్లతోటి నరకలేదు కాబట్టి పాలివాండ్లు కాదు.

బరిసెల తోటి పొడవ లేదు కాబట్టి పగవాండ్లు కాదు.

కత్తులతోటి పొడవలేదు కాబట్టి కనీసం కిరాయి గుండా లూ కాదు.

అయితే ఎవరు చంపారు?

అన్న ప్రశ్న అక్కడున్న ప్రతొక్కర్ని వేధిస్తుంది.

రంగారావు మాత్రం చావలేదు. చంపబడ్డాడు. అన్న నిర్ణ యానికి దాదాపు అందరూ వొచ్చారు.

పెద్దతరానికి చెందిన ఆడవాళ్ళు కొందరు కళ్ళ నీళ్ళు పెడుతున్నారు.

"అవును చెడ్డవాడు చచ్చినా ఏడిచే జనం ఉంటారు గదా!" మరికొందరాడవాళ్ళు మనస్సులో అనుకుంటున్నారు.

పోలీసు పటేలు స్టేషన్‌కు రిపోర్టు రాస్తూ రాస్తు, చచ్చి పడి ఉన్న రంగారావును చూశాడు.

రంగారావు వెలకల పడి ఉన్నాడు. కొందరు

చచ్చిగూడ నిద్రపోయినట్లుంటారు. రంగారావు మాత్రం అలా లేడు.

తనకేదో తట్టినట్టుగ అనిపించగ మరి దగ్గరికి వెళ్ళి చూశాడు.

మెడపై గోళ్ళూ గిగబడిన కాట్లు, శవంపడివున్న చుట్టూరా రంగారావు చావును ఎదిరించిన పోరాటపు గుర్తులు. "ఎప్పుడు పులిలా తిరిగే రంగారావు ఈ రోజు వీధిలో ఓఫ్! కుక్క చావు అంటే ఇదేనన్నమాట!'' అనుకుంటు పోలీసు పటేలు తన పని తాను చేసుకపోతున్నాడు.

* * *

ఓ కమ్మల గుడిసె. దానిముందు చొప్పదంటు, యీత ఆకులు వేసిన పందిరి. దాని కింద ఓ నుల్కమంచం. దాని మీద చినిగిన గోనెపట్టా, ఆ మంచంకాలును ఆనుకొని పడుకున్న నల్లకుక్క. అప్పుడే గంపకింద నుండివదిలిన ఓకోడి తనపిల్లలను వెంటేసుకొని ఎదురుగా వున్న ఎనుగు పైపు నడుస్తోంది.

అది గంగులు గుడిసె తన గుడిసెముందు ఉన్న కుంపటి ముందు కూర్చొని చుట్ట కాలుస్తు యింకా యిల్లుచేరని తన పిచ్చి బిడ్డగూర్చి ఆలోచిస్తున్నాడు. పిచ్చిమాలోకం నిద్రపోయి పోయి ఎప్పుడు లేచిపోయిందో ఎక్కడ పోయిందో, ఎటు

పోయిన ఎవరిని ఏమీ అనదు తనలో తానే కుమిలిపోతుంది. ఇరువై ఏళ్ళ బిడ్డ. ఒకరోజు పనికి పోయి వొచ్చి అనుకోకుండా మూగపోయి నిలుచుంది తిండి సరిగ తినదు. ఏడుపుతప్ప ఏం చెప్పలేదు.

అమ్మాయి ఆట పాటలు చూడలేని పాపాత్ముడు ఎవరో చేతబడి చేశారని ఊరంతా ఓ నిర్ణయానికి వొచ్చినపుడు గంగులు తన తలరాతను తిట్టుకున్నాడు.

అట్లానాలుగేళ్ళూ గడిసె, పెండ్లీడు దాటొచ్చె, పేదరికాన్ని మొయ్యలేక పిచ్చి బిడ్డను చూడలేక తనను తానే తిట్టుకుంటాడు. చనిపోయిన తన భార్య ఉంటే కనీసం బిడ్డనయినా సరిగ్గా చూసుకునేది. అనుకుంటూ కాలిన చుట్టను నేలకు వొత్తి ఆర్పేశాడు. ఏనుగు దగ్గర మేస్తున్న కోడి ఒక్కసారే అరుస్తూ తనపిల్లలను తన్నుకపోవాలనొచ్చిన గద్దను తరిమింది.

"అయ్యా"

"అమ్మా దుర్గా" అంటూ గంగులు తల పైకెత్తి తన ఎదురుగ నిలుచున్న బిడ్డను చూశాడు. అంతే అంతు పట్టని ఆనందం అతన్ని చుట్టేసింది. గుంజుకుపోయిన కళ్ళనుండి ఆనంద బాష్పాలు రాలుతున్నాయ్. తనబిడ్డ దుర్గ యింతకు ముందులా లేదు. తల స్నానం చేసింది. నుదుట బొట్టు, నవ్వుముఖం.

అచ్చం నాలుగేండ్ల కింద ఉన్న ఆ కళ మళ్ళీ ఈనాడు కనిపిస్తోంది.

నిన్న మొన్నటి వరకున్న మూగతనం యిప్పుడు మాయమైంది.

గంగులు తన బిడ్డను సమీపించి ఆమె తల నిమురుతూ నిలుచున్నాడు.

తండ్రి ఎదమీద తల పెట్టి నిల్చున్న దుర్గ కళ్ళల్లో రంగారావు కదిలాడు.

పొలంలో తన శీలాన్ని దోచుకున్నప్పుడు ఏడిచిన ఏడుపు తాను అరచిన అరపులు, ఏ మనిషికి వినపడలేదు! ఏ దేవునికీ వినపడలేదు. ఏడ్చి ఏడ్చి తననోరు మూగపోయింది. ఎవ్వరిక్కి చెప్పుకోలేని బాధ ఎదలో కదులుతూ వుండేది.

రాత్రి రంగారావు తన చేతుల్లో ప్రాణం వొదులుతున్నప్పుడు తన శీలం గూర్చిన బాధ తనను వీడి పోయింది.

చిన్నప్పుడు తల్లి కొట్టినపుడు తాను యిలాగే తండ్రి ఎదరొమ్మున ఓదార్పు పొందేది.

ఎదురుగ కంప చెట్టు కింద తన పిల్లలను రెక్కల కింద యిముడ్చుకొని కోడి కునుకు తీస్తుంది

○